గొల్లపూడి కాలమ్

## ముసిలి సమస్యలు

నేను చిత్తూరులో పనిచేసే రోజుల్లో(44 సంవత్సరాల క్రిందటి మాట)-రెండో లోక్‌సభ స్పీకర్ ఆనంతశయనం ఆయ్యంగార్ ఆల్లుడు రామస్వామి ఆయ్యంగార్ నాతో ఆత్యంత సన్నిహితంగా వుండే వారు. ఆ రోజుల్లో ఆయన శ్రీరామ విలాస సభ ఆధ్యక్షులు.

ఆ మధ్య- దాదాపు 30 ఏళ్ళ తర్వాత ఓ కుర్రాడు నడిపించుకు రాగా-అడుగులో ఆడుగు వేసుకొంటూ మద్రాసులో మాఇంటికి వచ్చారు. ఆప్పటికి ఆయనకి 85 దాటి వుంటాయి. రెండు చేతులూ పట్టుకొని ఆనందంగా ఆహ్వానించాను. బరువుగా ఊపిరి తీసుకొని:'ఈ వయస్సులో నా జబ్బేమిటో తెలుసా మారుతీరావ్?' ఆన్నారు.

ఏమిటన్నాను. 'ముసిలితనం'అన్నారు. పక్కనున్న కుర్రాడిని చూపిస్తూ'ఈ కుర్రాడు నా పనులన్నీ చేస్తాడు. నాకు భోజనం తెస్తాడు.ప్రస్తుతం రామవిలాససభ మేడ మీద వుంటున్నాను. ఈ కుర్రాడికి సినీమాల్లో మీ దగ్గర పనిచేయాలనివుంది.రికమెండు చెయ్యడానికి వచ్చాను'.అన్నారు.

ఆ దశలో ఆ కుర్రాడు పెద్ద ఊతం. జీవగర్ర. ఆ కుర్రాడి కోసం ఆ వయస్సులో చిత్తూరునుంచి ప్రయాణం చేసి వచ్చారు.(తర్వాత కొద్ది రోజులకే ఆయన పోయారు.)

ముసిలితనం ఓ రోగమయితే ఆ అస్థితిలో సానుభూతి,సహకారాలతోపాటు ఏమాత్రం ఆదరణని ఆందించగల వ్యక్తి ఆయినా దేవుడులాగ కనిపిస్తాడు. ముసిలితనం కోరుకొనే ఆపూర్వమయిన రోగ నివారణ-ఆదరణ.డబ్బుకాదు. వృద్ధాశ్రమాలు ఏ కొద్దిగానో ఈ రోజుల్లో ఆ సమస్యని తీర్చినా-

'బాగున్నావా తాతయ్యా?'

'కాఫీ తాగుతావా మామయ్యా?' ఆన్న పలకరింత యిచ్చినంత ఉపశమనం మరేదీ యివ్వదు.

నిన్ననే పేపర్లో ఒక వార్త.ఇటలీలో 79 ఏళ్ళ ముసలాయన ఉన్నాడు. ఆయనకి డబ్బుంది. డబ్బుతో నౌఖర్లు పనివాళ్ళు దొరుకుతారు.కాని డబ్బుతో మాత్రమే దొరకనిది ఒకటి వుంది-ఆదరణ,అభిమానం.

ఆయన పత్రికలో ఒక ప్రకటన యిచ్చాడు:దత్తతకి ఓ తాతయ్య సిద్ధంగా వున్నాడు-అంటూ. ఆయన భార్య 1992లో పోయింది. ప్రస్థుతం ఆయనకి కావలసింది 'తాతయ్యా' ఆంటూ ఆన్నం పెట్టే మనమడు. 'అయ్యగారూ'అంటూ కేరేజీ విప్పే నౌఖరు కాదు. ఇది చాలా ఆర్ద్రమయిన ఆరాటం. ఎవరూ తీర్చలేని అన్వేషణ. ఆందుకూ ప్రకటన.

ముసిలితనంలో ఏ వ్యక్తికయినా పెద్ద ఊతం,తోడు-భార్య. భర్త పోతే భార్య పిల్లలతో,మనవలతో కొంతవరకు సరిపెట్టుకోగలదేమోగాని-భర్త పూర్తిగా ఒంటరయిపోతాడు.

పద్మ భూషణ్ శ్రీపాద పినాకపాణిగారు మా ఆవిడకిస్వయానా చిన్నాయన. భార్య పోయాక మా ఆవిడతో అన్నారట:'పిన్ని పోయాక నా ఇంట్లో నేనే పరాయివాడిననిపిస్తోందమ్మా'అని. ఆయనకిప్పుడు 92 ఏళ్ళు.

సముద్రాల రాఘవాచార్యులుగారు ఏ సినీమా వ్రాసినా పక్కనే భార్య వుండేదట. ఆవిడ పోయిన కొన్ని నెలలకే ఆయనా పోయారు. ఈ మాట నాతో పనిచేసిన  ఆయన మేనల్లుడు చెప్పాడు.

సోమంచి యజ్ఞన్న శాస్త్రిగారు పోయిన తర్వాత వారబ్బాయిని ఆడిగాను:'మీ ఆమ్మగారెలావున్నారు?'అని. 'మారుతీరావుగారూ,భీష్ముడు స్వచ్ఛంద మరణం పొందాడని మనం చదువకొన్నాం. నాన్నగారు పోయాక అమ్మ ఆన్న,నీరూ ఆన్నీ దాదాపు మానేసింది. కొన్ని నెలల్లో పోయింది'అన్నారు ప్రసాదరావుగారు.

ఈ మధ్య ఎస్.డి.లాల్ కొడుకు మీర్‌తో ఓ టీవీ ప్రోగ్రాం చేశాను. లాల్ నాకు ఆత్యంత సన్నిహితుడు. ఎలాపోయరు?అని ఆడిగాను. 'అమ్మ పోయాక నాన్న బెంగ పెట్టుకున్నాడు. రోజూ ఆమ్మ సమాధి దగ్గర కెళ్ళి కూర్చునేవాడు. ఆ బెంగనుంచి ఆయన తేరుకోలేదు.పోయడు' ఆన్నాడు.

జీవితంలో ప్రతి వ్యక్తీ ఎదురుచూడకపోయినా మీదపడే జబ్బు-ముసిలితనం. ప్రతి ముసిలితనాన్నీ ఆలవోకగా తీర్చగలిగే మందు-ఆదరణ. డాలర్లు కాదు.(అమెరికాలో మాయమౌతున్న కుర్రాళ్ళూ యిది గుర్తుంచుకోండి.)

ముక్కూ మొహం తెలీని మనిషి డబ్బు తీసుకొనయినా 'తాతా' ఆని పిలిచినా చాలు ఆన్న ఆర్తిని 79 ఏళ్ళ ఇటలీ ముసిలి ఉపాధ్యాయుడు ఈ తరానికి గుర్తుచేస్తున్నాడు.